క్లుప్తంగా

ఉత్తమ సేవలకు అవార్డుల ప్రదానం



వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఉత్తమ వైద్య సేవలు అందించినందుకు ఉత్తమ సూపర్‌వైజర్‌గా కళమ్మ, ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా వెంకటేష్ డిప్యూటి డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు చేతుల మీదుగా శనివారం అవార్డులను అందుకున్నారు.

మత్స్యకళాశాలలో రక్తదాన శిబిరం



పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని మత్స్యకళాశాలలో శనివారం అసోసియేట్ డీన్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్ వారు రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు.

గుంతను పూడ్చాలని వినతి



వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని మర్రికుంట వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని శనివారం హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్యామ్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక పాఠశాల పక్కన ఉన్న గుంతతో విద్యార్థులకు, వాహనాలపై వెళ్లే వారికి ప్రమాదకరంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విశ్వం బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల ఆహ్వానపత్రం విడుదల



ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురంలో ఏప్రిల్ 19 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే దత్తాత్రేయ సంవర్ధిత రామదూత లక్ష్మీనరసింహ యోగానంద సద్గురు స్వామి వారి ఉత్సవాల ఆహ్వాన పత్రికను శనివారం ధర్మకర్తలు జోషి వేంకటేశ్వర శర్మ, జోషి గోపాల శర్మ విడుదల చేశారు. ఈ పత్రికను గ్రామంలోని భక్తులతో పాటుగా మండలం, జిల్లా లోని గ్రామాలకు ప్రచార నిమిత్తం పంపనున్నట్లు తెలిపారు. స్వామి వారి 125వ ఆరాధన సహిత లక్షదీపోత్సవ కార్యక్రమాన్ని ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడిపై దాడి: కేసు నమోదు

పాన్‌గల్: అకారణంగా యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోప్లాపూర్ చెందిన రొయ్యల శ్రీకాంత్‌పై పెబ్బేరు మండలం అయ్యవారిపల్లికి చెందిన వీరేష్, విజయ్, రవి కలిసి గోప్లాపూర్‌లో దాడి చేశారు. శ్రీకాంత్ స్పృహ కోల్పోయి పడిపోవడంతో చనిపోయాడని అనుకుని వారు అక్కడి నుంచి పారిపోయారు. కొద్దిసేపటికి స్పృహలోకి వచ్చిన శ్రీకాంత్ తండ్రికి ఫోన చేసి విషయం చెప్పగా, అతన్ని వెంటనే ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ దాడికి భార్యాభర్తలు బొల్లెద్దుల విష్ణు, బొల్లెద్దుల లక్ష్మి కారణమని, వారి ప్రోద్బలంతోనే వారు దాడికి పాల్పడిన తండ్రి ఆరోపించారు. తండ్రి రొయ్యల వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెబ్బేరులో నగదు సీజ్



పెబ్బేరు రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కొత్తకోట బైపాస్ వద్ద శనివారం పోలీసులు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో రూ.54వేలు నగదుకు ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశామని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

బీటీ మరిచారు..



కంకరపోసి అసంపూర్తిగా వదిలేసిన మామిడిమాడ, పర్వతాపురం రోడ్డు

- అసంపూర్తిగా వెల్కిచెర్ల – ఖిల్లాఘనపురం రోడ్డు పనులు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- వాహనాల రాకపోకలతో ఇళ్లలోకి వస్తున్న దుమ్ము

ఖిల్లాఘనపురం: మండల కేంద్రం నుంచి భూత్పూర్ మండలం వెల్కిచెర్ల వరకు దెబ్బతిన్న రోడ్డుకు బీటీ రెన్యూవల్ వేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడటంతో కాంట్రాక్టర్ సల్కెలాపురం సమీపం నుంచి పర్వతాపురం వరకు రోడ్డు తవ్వి కంకర పోశారు. ఈ పనులు చేసి సుమారు ఆరు నెలలు కావస్తున్న బీటి వేయక పోవడంతో సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి, మామిడిమాడ, పర్వతాపురంతో పాటుగా ముందలితండా, వెనికి తండా, బక్కతండా, మేడిబాయి తండాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



వాహనాలు వస్తున్న సమయంలో రోడ్డు పై నుంచి వస్తున్న దుమ్ము

రూ.4కోట్ల నిధులు మంజూరు

మండల కేంద్రం నుంచి వెల్కిచెర్ల వరకు మొత్తం 14 కిలోమీటర్ల రోడ్డుకు బీటీ రెన్యూవల్ కోట్ వేయడంతో పాటుగా అవసరమైన ప్రాంతాల్లో పాడుబడిన బావుల వద్ద రక్షణ గోడలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.4 కోట్ల మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినప్పటికీ మధ్యలోనే వదిలేశారు. కొంతదూరం కంకర పోసి వదిలేయగా మిగతా రోడ్డు పనులు చేపట్టలేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కంకరవేసి వదిలేశారు..



మా ఇంటి ముందు నుంచి వెల్కిచెర్లకు వెళ్లే రోడ్డు ఉంది. రోడ్డు పనులు చేస్తున్నామని చాలా నెలల కిందట కంకర పోశారు. ఇప్పటి వరకు దాంబర్ వేయలేదు. టిప్పర్లు, ట్రాక్టర్లు ఏవి వచ్చినా దుమ్ము మా ఇంట్లోకి వస్తుంది. ఎవరికి చెప్పాలో తెలియడంలేదు. చాలా ఇబ్బందిగా ఉంది. వెంటనే రోడ్డు పూర్తి చేయాలి.

– పాత్లావత్ లాలునాయక్, సల్కెలాపురం తండా

త్వరలోనే పూర్తి..

మండల కేంద్రం నుంచి పలుగ్రామాల మీదుగా వెల్కిచెర్ల వరకు ఉన్న బీటీ రోడ్డుకు రెన్యూవల్ కోట్ వేసేందుకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ రక్షణ గోడలు కట్టడంతో పాటుగా మెటల్ వేశారు. పనులు ఆలస్యం చేయడం వలన నోటీసులు జారీ చేశాం. త్వరలోనే పనులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– రాకేష్, ఏఈ ఆర్అండ్‌బీ శాఖ

ఇళ్లలోకి దుమ్ము

మండలంలోని సల్కెలాపురం శివారులో నుంచి పర్వతాపురం వరకు రోడ్డు పనుల్లో భాగంగా మెటల్ వేసి వదిలేశారు. రోడ్డుపై తరుచుగా వాహనాలు తిరుగుతుండటంతో దుమ్ము ఎక్కువగా లేసి ఇళ్లలోవస్తుందని సల్కెలాపురం తండా, సల్కెలాపురం, మాటామిడిమాడ గ్రామాల ప్రజలు ఆగ్రహిస్తున్నారు. పెద్ద వాహనాలు వచ్చిన సమయంలో ఏకంగా వంట గదుల్లోకి దుమ్ము వస్తుందని చెబుతున్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



బాలకిష్టాపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

పాన్‌గల్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ నరేందర్ అన్నారు. శనివారం మండలంలోని జమ్మాపూర్‌లో మహిళ శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు బాల్య వివాహాల నిరోధం, బాలల పరిరక్షణపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఆడ పిల్లలను మగ పిల్లలతో సమానంగా చదివించాలని, బాలల హక్కులను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉమాదేవి, కూలీలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఆత్మకూర్: బాల్యవివాహాల వల్ల ఎన్నోరకాల అనార్థాలు చోటు చేసుకుంటాయని, దురాచారాన్ని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం నిర్వాహకుడు నరేష్ అన్నారు. శనివారం మండలంలోని బాలకిష్టాపూర్‌లో గ్రామస్తులకు, ఉపాధి హామీ కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నతనంలోనే వివాహం చేయడంతో బాలిక ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతోపాటు శిశువులు అనారోగ్యంగా పుడుతారని తెలిపారు. గ్రామాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే సమాచారం ఇవ్వాలన్నారు.



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న నరేందర్

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

అమరచింత: గ్రామాల్లోని వన నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం సరికాదని.. మొక్కలకు నిత్యం నీటిని అందించి సంరక్షించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ కోరారు. శనివారం మండలంలోని చంద్రగఢ్ గ్రామంలో ఉన్న వన నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, డంపింగ్‌యార్డు, పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ శ్రీనివాసులును ఆదేశించారు. గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరియాలని ప్రభుత్వం నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతుందని.. వర్షాకాలంలో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసి నాటి సంరక్షించేలా చూడాలని సూచించారు. రహదారుల వెంట నాటిన మొక్కలు వాడుముఖం పట్టకుండా ట్యాంకర్లతో నీటిని అందించాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారుచేసి రైతులకు విక్రయించి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. అంతర్గత రహదారులు, మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సుల్తాన్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈసీ రఘు తదితరులు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలించి మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌సంచిత్ గంగ్వార్

టీబీ నిర్మూలనకు సహకరించాలి



కేతేపల్లిలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: గ్రామాల్లో టీబీని సంపూర్ణంగా నిర్మూలించేందుకు అందరూ సహకరించాలని సూపర్‌వైజర్ సుమనశ్రీ అన్నారు. ప్రపంచ టీబీ వ్యాధి నిర్మూలన దినోత్సవంలో భాగంగా శనివారం మండలంలోని కేతేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. 2025వ సంవత్సరం నాటికి ఈ వ్యాధిని సంపూర్ణంగా అంతం చేసేందుకు ప్రతిఒక్కరు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వైద్యుడి సూచన మేరకు పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుందన్నారు. మందులు వాడే రోగులకు పోషక ఆహారం కోసం నెలకు రూ.500 అందిస్తారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి, సంధ్య, కవిత, ప్రమీల, చిన్నమ్మ పాల్గొన్నారు.

క్షయను నిర్మూలిద్దాం

పెబ్బేరు రూరల్: క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారి చంద్రశేఖర్ పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ స్వరూపరాణి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుల అరెస్ట్

గోపాల్‌పేట: దొరసాని ఇంట్లో చోరీ చేసిన వారిని పోలీసులు గుర్తించారు. సీఐ నాగభూషనం తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలో ఫిబ్రవరి 18న భారతమ్మ కుటుంబసభ్యులు ఇంట్లో లేని సమయంలో చోరీకి పాల్పడ్డారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శనివారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒకరిని కానిస్టేబుల్ గుర్తించి బ్యాగులో చూడగా వడ్డానం, కాళ్ల కడాలు, గొలుసులు కనిపించాయి. స్టేషన్‌కు తీసుకెళ్లి సీఐ సమక్షంలో పూర్తిస్థాయి విచారణ చేయగా, చోరీ తానే చేశానని, త నపేరు నల్లపోతుల లింగస్వామి అని, తనది శానాయిపల్లి గ్రామం రేవల్లి మండలం అని చెప్పాడు. చాకల్‌పల్లి రోడ్డులో ఉన్న ఇంటిని గమనించి గతనెలలో ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకుని చోరీ చేశానని చెప్పాడు. తన సడ్డకుడు బిజినేపల్లికి చెందిన యుగంధర్‌కు ఆభరణాలు ఇవ్వగా ముత్తూట్ ఫైనాన్స్‌లో పెట్టి అతను రూ.2.20 లక్షల తీసుకున్నట్లు తెలిపాడు. లింగస్వామి నుంచి వంద తులాల వెండి (35 తులాల వడ్డానం, 50 తులాల కాళ్ల కడియాలు, 15 తులాల గొలుసులు), వీటితో పాటు యుగంధర్ ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన మూడు తులాల నాను, నల్లపూసల దండ, పగడాల దండ, ఉంగరాన్ని రికవరీ చేశామని సీఐ తెలిపారు.



పట్టుబడిన ఆభరణాలతో పోలీసులు

గొర్రెల చోరీ చేసి అమ్ముతుండగా పట్టివేత

పెబ్బేరు రూరల్: మండల పరిసర ప్రాంతాలల్లో గొర్రెల చోరీకి పాల్పడిన ముగ్గురిని చేశామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి శనివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం పాన్‌గల్ మండలం చింతకుంటకు చెందిన రామాంజి, ఎల్లస్వామి, కర్నూల్ జిల్లా నందికొట్కూరు చెందిన కావేటి శ్రీనివాసులుతో పాటు మరో ముగ్గురు కలిసి మండలంలోని రంగాపురం, అయ్యవారిపల్లి పరిసర ప్రాంతాల్లో గొర్రెలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వారిని శనివారం పెబ్బేరు సంతలో గుర్తించి పట్టుకున్నామని వారి నుంచి రూ.1.55లక్షల నగదును, బొలెరో వాహనాన్ని సీజ్ చేశామన్నారు. పట్టుబడిన ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ

ఇత్తడి కవచం వితరణ



గోపాల్‌పేట: బుద్దారం చెందిన శ్రీనివాసాచారి, లావణ్య దంపతులు గండి ఆంజనేయస్వామికి ఇత్తడి కవచం వితరణ చేశారు. ఈఓ రామేశ్వర శర్మ, మాజీ సర్పంచ్ వెంకటయ్య, గ్రామ పెద్దలు జూనియర్ అసిస్టెంట్ నాగేష్ పాల్గొన్నారు.

వీపనగండ్ల విద్యార్థికి పీహెచ్‌డీ

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన బత్తుల అరుణ్‌కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ వాణిజ్య విభాగం ప్రొఫెసర్లు రవికుమార్, శ్రీనివాసమూర్తి డాక్టరేట్ పట్టాను అందజేశారు. పెర్ఫార్మెన్స్ ఇవాల్యుయేషన్ ఆఫ్ పెన్షన్ ఫండ్ మేనేజర్స్ ఆఫ్ నేషనల్ పెన్షన్ సిస్టమ్ ఇన్ ఇండియా –ఏ కంపేరటివ్ స్టడీ అంశంలో పరిశోధన చేసినందుకు పట్టాను అందించారు. వీనపనగండ్ల చెందిన బత్తుల ఆంజనేయులు, నిర్మలమ్మ కుమారుడైన ఈయన గ్రామీణ ప్రాంతంలో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవడంపై ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు అతనికి అభినందనలు తెలియజేశారు.

బాధితుడికి మంత్రి పరామర్శ

వీపనగండ్ల: మండలంలోని వల్లాభాపూర్ చెందిన బల్‌రాం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు అతనిని పరామర్శించారు. మెరుగైన వైద్య అందించాలని ఆయన వైద్యాధికారులను సూచించారు.

రామన్‌పాడులో తగ్గుతున్న నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. శనివారం 1,011 అడుగులకు నీటిమట్టం చేరింది. తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

సహజ రంగులతో హోలీ సంబరాలు



సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొత్తకోట రూరల్: హోలీ సంబరాలను సహజ రంగులతో నిర్వహించుకోవాలని రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రామకృష్ణ తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ముందస్తు హోలీ సంబరాలు నిర్వహించారు. వెదురు బొంగులతో పంపులను తయారు చేసి సహజ సిద్ధ రంగులను చల్లుకున్నారు. దేశం విభిన్న సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమని, అందులో హోలీ పండుగ దేశమంతా చేసుకునే ప్రత్యేక రంగుల పండుగ అని తెలిపారు.

‘పది’ పరీక్ష కేంద్రాల పరిశీలన



పాన్‌గల్‌లో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో శనివారం గణితం పరీక్ష పూర్తయినట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు అజీమ్‌పాషా, సురేష్, డిపార్ట్‌మెంటల్ అధికారులు రాజవర్ధన్‌రెడ్డి, మంజుల తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలలో 220 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 143 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

ఖిల్లాఘనపురం: బాలుర ఉన్నత పాఠశాలలో 230 మంది విద్యార్థులకు వంద శాతం హాజరైనట్లు ఎంఈఓ ఉషారాణి తెలిపారు. కళాశాలలోని కేంద్రానికి 235 మంది విద్యార్థులకు ఒకరు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పరిశీలించారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ మహ్మదీయ మసీద్‌లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శనివారం రాత్రి ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ మేరకు ముస్లింలకు పండ్లు తినిపించగా, మత పెద్దలు, చిన్నారులు పండ్లను ఎమ్మెల్యేకు తినిపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



జిల్లా కేంద్రంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



అమరచింతలో నివాళి అర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో ఐద్యా మహిళా సంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కవి జనజ్వాల, ఐద్యా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా టీజేఏసీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

పాన్‌గల్: భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, బాల్యనాయక్ అన్నారు. మండల కేంద్రం, కేతేపల్లి, తెల్లరాళ్లపల్లితండాలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

మదనాపురం: మండలంలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో చిరంజీవి, చెన్నయ్య, కురుమన్న, జగదీష్, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

వీపనగండ్ల: ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గోపల్‌దిన్నె, బొల్లారంలో భగత్‌సింగ్ చిత్రపటానికి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సీపీఐ కార్యవర్గ సభ్యుడు వంక గోపాల్ నివాళులర్పించారు.

పెబ్బేరు రూరల్: ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం వనపర్తి జిల్లా గ్రంథాలయంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, నాగరాజు, గోపాలకృష్ణ, రమేష్, కుతుబ్ పాల్గొన్నారు.

అమరచింత: భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. పార్టీ మండల కార్యదర్శి రాజన్న, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రమేష్, పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో సీపీఐ జెండకట్ట వద్ద భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

కొత్తకోట రూరల్: 23ఏళ్ల వయస్సులో దేశంకోసం ప్రాణాలర్పించిన గొప్ప దేశభక్తుడు భగత్‌సింగ్ అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ అన్నారు. స్థానిక చౌరస్తాలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

ఆత్మకూర్: సీపీఎం, సీపీఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా పట్టణంలోని డిగ్రీ కళాశాలలో, కార్యాలయాల్లో భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని నిర్వహించారు. మండలంలోని మూలమళ్లలో భగత్‌సింగ్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజు, రాఘవ, రమేష్, భాను, ప్రణయ్, సాయి పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కమ్మరి గోపి ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద వారి చిత్రపటాలను పూలమాలలు వేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com